క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


పంగి రమణ

పెందుర్తి: అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలోని బాకూరు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయింది.వివరాలు.. జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఈ నెల 4వ తేదీన హుకుంపేట మండలం నుంచి 21 మంది రోగులను చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తీసుకువచ్చారు. 21 మందిలో పంగి రమణ(52) అనే వ్యక్తి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 93090 36353 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైతులకు సూచనలు


చింతపల్లిలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

అడ్డతీగల/కొయ్యూరు/చింతపల్లి రూరల్: అడ్డతీగల మండలంలోని బొడ్లంక, గొండోలు, చేనుపాకలు, పాపంపేట, దుశ్చర్తి, గొంటువాని పాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారి ఎం.సువర్ణకుమార తదితరులు పర్యటించారు. నీట మునిగిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. చింతపల్లి మండలంలోని కొత్తపాకలు, చిన్నగడ్డ, పశువులబంద, తాజంగి తదితర ప్రాంతాల్లో ఎంపీడీవో ఆశాజ్యోతి, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు జోగారావు, శ్రీనివాసరావు సందర్శించారు.కొయ్యూరులో ఏవో ఉమాదేవి పలు తుపాను ముంపు ప్రాంతాలను సందర్శించారు. వారు రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి వెన్నులు మీద 10 శాతం ఉప్పు నీరు (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి) పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పైరు పనలు తడిస్తే ఉప్పు ద్రావణంలో (లీటరు నీటికి 50 గ్రాములు ఉప్పు కలిపి)కంకులను ముంచి ఆరబెట్టాలన్నారు. ఉప్పు ద్రావణం వాడడం వీలుకాని పక్షంలో తడిచిన పనలను ఆరబెట్టి కుప్పలుగా వేస్తే ఉప్పు పొడిని వరి కంకులపై చల్లాలని చెప్పారు. నూర్చిన తర్వాత వరి ధాన్యం తడిస్తే క్వింటా ధాన్యానికి ఒక కిలో కళ్లు ఉప్పు నాలుగు కిలోల ఊక లేదా గడ్డి (గడ్డి చిన్న చిన్న ముక్కలుగా చేసి)కలిపి కుప్పలుగా పోసి వారం రోజుల తర్వాత ఆరబెట్టాలన్నారు. నీటి మునిగిన వరి పనలపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత తడిసిన పనలను గట్లపై ఆరబెట్టి మొక్కలు రాకుండా ఐదుశాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు.

వరి, చెరకు సంరక్షణకు సూచనలు

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా మండంలో వివిధ గ్రామాల్లో నీటి మునిగిన వరి పంటలను స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరకు ప్రధాన శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, ఆర్.సరిత, డి.ఉమా మహేశ్వరరావులు రైతులకు పలు సూచనలు చేశారు. వరి కోతకోసి పొలంలో ఉన్న పనలు వర్షంలో తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, నూర్చిన ధాన్యాన్ని 2–3 రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే గింజ మొలకెత్తడమేకాక రంగుమారి చెడువాసన వస్తుందన్నారు.
తాజా వర్షాలకు ముంపునకు గురైన చెరకు పొలాల్లో నీటిని వీలైనంతగా తొలగించి, పడిపోయిన తోటలను జడ చుట్టు ద్వారా నిలబెట్టాలన్నారు. నీటిని తొలగించి ఎకరాకు 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపోటుగా వేసుకోవాలని సూచించారు.

పుణ్యక్షేత్రాలకు ఇరుముడులతో శివస్వాములు


పీఠం నుంచి బయలుదేరుతున్న శివభక్తులు

మునగపాక: స్థానిక సాంబశివుని పీఠంలో మాలలు ధరించిన శివభక్తులు పుణ్యక్షేత్రాలు సందర్శించేందుకు బుధవారం బయలుదేరారు. వేదపండితులు సాయికుమార్ 24 మందికి ఇరుముడులు కట్టారు. గురుస్వామి మాడెం జోగారావు సారధ్యంలో వారంతా పుణ్యక్షేత్రాలకు వెళ్లారు.

అతివలకు ఆర్థిక చేయూత



- వైఎస్సార్ చేయూతతో డ్వాక్రా సంఘాలకు రుణాలు
- స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి
- ఆనందంలో గిరిజన మహిళలు


వైఎస్సార్ చేయూత సాయంతో షాపు ఏర్పాటు చేసుకున్న గిరిజన మహిళ

దుంబ్రిగుడ: గిరిజన మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘ సభ్యులకు రుణాలు అందిస్తోంది. ఆయా నగదుతో గిరిజన మహిళలు చిరు వ్యాపారులు, కోళ్లు, మేకలు పెంపకం చేస్తూ ఆర్థికాభివృద్ధి పొందుతూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. మండలంలోని 54 గ్రామైఖ్య సమాఖ్యలు(వీవోలు) ఉండగా, 1134 మహిళ శక్తి పొదుపు సంఘాలు(డ్వాక్రా సంఘాలు) ఉన్నాయి. వైఎస్సార్ చేయూత ద్వారా ఒక్కో లబ్ధిదారునికి ప్రతి ఏడాది రూ,18,750 ల చొప్పున జమ చేస్తోంది. మండలంలో 7,125 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. ఏటా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతలకు రూ,133,593,750లను లబ్ధిపొందారు. ప్రభుత్వం వైఎస్సార్ చేయూతతో పాటు బ్యాంకు ద్వారా రుణం అందజేసి ఆర్థికాభివృద్ధికి సాయం అందజేస్తోంది. బ్యాంకు ద్వారా రూ,75 వేల కంటే ఎక్కువ రుణాన్ని అందజేస్తోంది. ఎటువంటి వడ్డీ చెల్లించనవసరం లేకుండా ఈ అప్పు నాలుగేళ్లలో తీరిపోయేలా పక్కా ప్రణాళికను రూపొందించింది. కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా పిల్లల చదువులకు ఆటంకం లేకుండా పేద, మధ్య తరగతి మహిళలు తమ సంసార నావను ముందుకు నడిపించేందుకు వైఎస్సార్ చేయూత ఒక వరంలా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బాటలు పడ్డాయి. అక్క, చెల్లెమ్మలు స్వయం ఉపాధి పొంది వారి స్వశక్తితో గర్వంగా నిలబడి, కుటుంబ పోషణలో వారికి ప్రత్యేక స్థానం ఉండాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యోచించింది. అందుకు అనుగుణంగా మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకుంటున్నారు.


డ్వాక్రా సంఘ సభ్యులకు చెక్కు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ(ఫైల్)


వైఎస్సార్ చేయూత సొమ్ముతో మేకలు, గొర్రెల పెంపకం చేస్తున్న గిరిజన మహిళ

మండలం: దుంబ్రిగుడ
పంచాయతీలు: 18
గ్రామాలు: 285
జనాభా: 56,250
వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు: 7,125
ఒక్కో లబ్ధిదారుడికి ఏటా అందుతున్న సాయం రూ.18,750
మూడు విడతల ద్వారా పొందిన లబ్ధి రూ.13,35 కోట్లు

అరమ పరిధిలో ఆరు సంఘాలకు రూ.1,12,500
పోతంగి పంచాయతీ పరిధిలో 12 సంఘాలకు రూ. 2,25,000
గేదెలబందలో ఆరు సంఘాలకు రూ.1,12,500
వంతలచింత మూడు సంఘాలకు రూ.56,250

జగనన్నకు రుణపడి ఉంటాం



మా కుటుంబంలో ముగ్గురు కూలీ పనులు చేసుకుంటూ బతికేవారం. ముఖ్యమంత్రి జగన్‌మోన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత ద్వారా మాకు లభించిన ఆర్థిక సహాయంతో చిన్న కిరాణా షాపు ఏర్పాటు చేసుకున్నాను. ఈ పథకం ఎంతగానో ఆదుకుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం మా వంటి పేదలకు ఎటువంటి సాయం అందించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి మా లాంటి పేదల బతుకుల్లో వెలుగులు నింపారు. జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

–పాంగి సొయిత, దుంబ్రిగుడ

వైఎస్సార్ చేయూత ఓ వరం



మా లాంటి నిరుపేద గిరిజన మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ఒక వరం. పెద్ద మనస్సున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి వల్ల మాలాంటి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం అందించిన సాయంతో మేకలు, గొర్రెలు రెండు యూనిట్లు కొనుగోలు చేసుకుని కుటుంబ పోషణ చేస్తున్నాను. ఏటా మేకలు, గొర్రెలు విక్రయించి ఆర్థికంగా లాభాలు పొందుతున్నాం. మంచి చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– కిల్లో జమున, గిరిజన మహిళ, దుంబ్రిగుడ

కొనసాగుతున్న సర్వే



ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సా ర్‌చేయూత పథకానికి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోంది.గత ఏడాది 1,925 మంది చేయూత పొందారు. రెండో విడత 2,222 మంది పొందారు.మూడో విడత 2,978 మంది.వైఎస్సార్ చేయూత లబ్ధి పొంది వారి వివరాలు రెన్యూవల్ చేశాం. దీంతో పాటు అర్హులను సచివాయ సిబ్బంది సర్వే చేస్తున్నారు.అర్హులకు చేయూత అందించాలన్నదే ధ్యేయం అన్నారు.

–సూరిబాబు, ఏపీఎం, దుంబ్రిగుడ

ముంచెత్తిన మిచాంగ్


కాశీపట్నం గోస్తనీ నది వద్ద గిరిజనులకు పలు సూచనలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

- ఎడతెరిపి లేకుండా వర్షం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు


కొర్రా పంచాయతీ కేంద్రంలో కూలిన ఇంటి గోడ


చినలబుడులో వరి కుప్పలు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు,


పి.యర్రగొండలో కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు


డి.మల్లవరం వద తాత్కాలిక కల్వర్టు పనులను పర్యవేక్షిస్తున్న డీఈ గౌతమి


కొండపడలో రైతులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

అరకులోయ రూరల్/పెదబయలు/ఎటపాక/దేవీపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా మన్యంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కల్వర్టులు, వంతెనల మీదుగా భారీగా నీరు ప్రవహిస్తోంది. రహదారులపై భారీ చెట్లు కూలిపోయాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను ధాటికి పొలాల్లో వరదనీరు ముంచెత్తింది. వరి, మొక్కజొన్న, మిర్చీ, పొగాకు, చోడితో పాటు పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడిన శ్రమ నీటి పాలవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఈదురుగాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. సెల్ సిగ్నల్స్ అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
చినలబుడు పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణకుమారి, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, బస్కి పంచాయితీలో వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, కొత్తభల్లుగూడలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, లోతేరులో సర్పంచ్ కళావతి పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, భీమరాజు, నాయకులు రంజిత్‌కుమార్, రామారావు, గురుమూర్తి తదితరులున్నారు.
అనంతగిరి: కాశీపట్నం, జీనబాబు పంచాయతీల్లో ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. నీట మునిగిని పంటలను పరిశీలించారు. రైతులకు మనోధైర్యం ఇచ్చారు. గ్రామస్తులకు గెడ్డలు దాటవద్దని సూచించారు. కో ఆప్షన్‌సభ్యుడు మదీనా, తదితరులు పాల్గొన్నారు.
హుకుంపేట: రాప, సంతారి, కొట్నాపల్లి పంచాయతీలతో పాటు పలు ప్రాంతాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం పర్యటించారు. తుపాను పరిస్థితిని పరిశీలించారు. నాయకులు లక్ష్మయ్య, చంద్రావు, సింహాద్రి, బొంజుబాబు, రామన్న, బాలాజీ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.
దుంబ్రిగుడ: తుపాను దాటికి కొర్రా గ్రామంలో ఓ గిరిజనుడు ఇంటి గోడ కూలిపోయింది.వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు తదితరులు బాధితుడిని పరామర్శించి, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.
ముంచంగిపుట్టు: ఏనుగురాయి పంచాయతీ కొండపడలో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, నేత పులిరాజు పర్యటించారు. నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులకు భరోసా ఇచ్చారు.
గూడెంకొత్తవీధి: దేవరాపల్లిలో ఓ గిరిజనుడి ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు ఆదుకోవాలని వారు కోరారు.
చింతపల్లిరూరల్: మండలంలోని బురుసింగి తదితర ప్రాంతాల్లో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పర్యటించారు. బురుసింగిలో ఈదురుగాలులకు చెట్టు పడి రెండు ఇళ్లు కూలిపోయాయి. బాధితులను పరమర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.
కొయ్యూరు: తుపాను ముంపు ప్రాంతాలను తహసీల్దార్ తిరుమలరావు, ఏవో ఉమాదేవి వేర్వురుగా సందర్శించారు. తుపాను వల్ల పలుచోట్ల మూడు ఇళ్లు పాక్షికంగా ఒక ఇల్లు పూర్తిగా దెబ్బతిందన్నారు.
సీలేరు : దుర్గావీధి,అల్లూరి వీధితో పాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.
చింతూరు: చింతూరు మండలంలో 144.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. తిమ్మిరిగూడెం రహదారిపై నుంచి వరదనీరు ప్రవహించడంతో పలు ప్రాంతాలకు కొంతసేపు రాకపోకలు నిలిచాయి.
గంగవరం : మండలంలో జగ్గంపాలెం, జియ్యంపాలెం, నెల్లిపూడి, భయ్యనపల్లి తదితర ప్రాంతాల్లో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంఆర్ఐ ఫయాజ్ భాషా, వ్యవసాయాధికారి విశ్వనాథ్, వీఆర్వోలు పర్యటించారు. నీటి మునిగిన పంటలను పరిశీలించారు. ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.
రాజవొమ్మంగి: మండలంలో 174.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. జడ్డంగిలో సర్పంచ్ మురళీకృష్ణ పర్యటించారు. లబ్బర్తి–డీ.మల్లవరం మధ్య కొండ వాగు ఉప్పొంగడంతో కల్వర్టు కొట్టుకుపోయింది. గిరిజనసంక్షేమ డీఈ గౌతమి, ఏఈ వీరభద్రరావు, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు ఆ ప్రాంతానికి చేరుకొని తాత్కాలిక వంతెన ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.
వై.రామవరం: తుపాను ముంపు ప్రాంతాల్లో సర్పంచ్ రాజేశ్వరి, నేత తమ్మిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పర్యటించారు.
పి.యర్రగొండ గ్రామానికి చెందిన ఓ గిరిజనుడి ఇంటి ప్రహరీ కూలిపోయింది. బాధితులను వారు పరామర్శించారు. పరిహారం చెల్లించుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
కూనవరం: తుపాను ముంపు ప్రాంతాల్లో తహసీల్దార్ కె.అనసూయ, హెచ్‌వో ముత్తయ్య, వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మి పర్యటించారు. వరద బాధితులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.
మారేడుమిల్లి :మారేడుమిల్లి నుంచి మద్దులూరు వెళ్లే మార్గంలో మట్టిలో టిప్పర్ లారీ దిగబడి బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వీరా కిషోర్ పర్యటించారు. ప్రజలకు అప్రమత్తం చేశారు


రైతులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మత్స్యలింగం


సీలేరులో కురుస్తున్న వర్షం


తాజంగిలో నీట మునిగిన వరి కుప్పలను పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషదేవి


పంటలను పరిశీలిస్తున్న ఏవో ఉమాదేవి


మద్దులూరు వద్ద బోల్తాపడిన టిప్పర్

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెన్‌కో ఇంజనీర్లు


దుంబ్రిగుడలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, నాయకులు



మారేడుమిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎంపీటీసీ బాబీ


ముంచంగిపుట్టులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సీతమ్మ, నేతలు

దుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/సీలేరు/గంగవరం/మారేడుమిల్లి/అడ్డతీగల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా బుధవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని కృషి చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎంపీపీలు బాక ఈశ్వరి, అరిసెల సీతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చట్టారి జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, మల్లికార్జున్, సర్పంచ్ దుర్గో, ఉప సర్పంచ్ ప్రసాద్, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఆర్ఐ జిలానీ, జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, నాయకులు సింహాచలం, కృష్ణారావు, నాగేశ్వరరావు, తిరుపతిరావు, జయదేవ్, బాబీ, బీఎస్పీ నేత మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

13న సామాజిక సాధికార బస్సు యాత్ర

అరకులోయ రూరల్: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో ఈనెల 13న హుకుంపేటలో చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు అన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మండలంలో చినలబుడు పంచాయతీ పరిధిలో వివిద గ్రామల్లో ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పర్యటించారు. బస్సు యాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతానికి అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేస్, నాయకులు సన్యాసిరావు, రాంచందర్, గురుమూర్తి, శెట్టి గోపాల్, గురు , రామ్మూర్తి పాల్గొన్నారు.